www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 12 ఫిబ్రవరి 2025
5
అన్నమయ్య

విద్యార్థులను దూషించిన అధ్యాపకుడికి మెమో

- అధ్యాపకుడిపై ఆర్‌జెడికి ప్రిన్సిపల్ ఫిర్యాదు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

విద్యార్థినుల పట్ల అసభ్య పదజాలంతో దూషించడంతో ఓ అధ్యాపకుడికి మెమో జారీ చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలలోకి వెళితే... పట్టణంలోని ఎన్‌టిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న ఓ కామర్స్ అధ్యాపకుడు ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినిలను అసభ్య పదజాలంతో దూషిస్తున్నాడని విద్యార్థులు ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన ప్రిన్సిపల్ బాబు అధ్యాపకులతో కమిటీ వేసి విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో ఆ కామర్స్ అధ్యాపకుడికి మెమో జారీ చేసినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు ఇచ్చిన ఫిర్యాదు వాస్తవమేనని, అధ్యాపకుడి అసభ్య పదజాల మాటలపై చేపట్టిన నివేదికను కడప ఆర్‌జెడికి పంపించినట్లు తెలిపారు. మరో రెండు రోజుల్లో ఆర్‌జెడి విచారణకు రానున్నట్లు తెలిపారు.

ఎస్‌సి మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

ఎస్‌సి మహిళలు ప్రభుత్వం అందజేస్తున్న రాయితీ రుణాలను పొంది జీవనోపాధులు మెరుగుపరుచుకొని ఆర్థికంగా అభ్యున్నతి చెందాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అన్నారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లో పిజి ఆర్‌ఎస్ హాలులో సెర్ప్, ఎస్‌సి కార్పొరేషన్, ఎపి కార్పొరేషన్ క్యాస్ట్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత స్వయం సహాయక సంఘాలలో ఉన్న ఎస్‌సి మహిళలకు కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకం 'ప్రధానమంత్రి అనుసూచిత్ జాతి అభ్యుదయ యోజన' పథకం పై ఒకరోజు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా స్వయం సహాయక సంఘాలలో ఉన్న ఎస్‌సి మహిళల జీవనోపాధుల మెరుగుదలకు రాయితీతో వడ్డీ లేని రుణాలను అందజేస్తున్నాయన్నారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 48 యూనిట్లకు రాయితీతో కూడిన వడ్డీ లేని రుణాలు రూ.74.50 లక్షలు మంజూరు చేసేందుకు తెలిపారు. ఇందులో లబ్ధిదారుల వాటా 10 శాతం రూ.7.50 లక్షలు, సంఘంలో ఉన్న ప్రతి సభ్యురాలికి రూ.50 వేల రాయితీతో రూ.24 లక్షలు, సెర్ప్-ఉన్నతి ద్వారా వడ్డీ లేని రుణం రూ.43 లక్షలు మంజూరు అయినట్లు తెలిపారు. ఇలాంటి మంచి పథకాన్ని ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. అనంతరం మంజూరైన రుణాలను మహిళలకు చెక్కులను అందజేశారు. సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి రాజ్యలక్ష్మి, స్కిల్ డెవలప్మెంట్ అధికారి దాసరి నాగార్జున, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ శ్రీధర్

అమెరికా దుశ్చర్యను వ్యతిరేకిస్తూ నిరసన

నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అమెరికాకు వలస వెళ్లిన భారతీయులను ఆ దేశం ఖైదీల్లా చూస్తోందని, ఈ దుశ్చర్య తీవ్రంగా ఖండిస్తూ మంగళవారం మదనపల్లెలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ మాట్లాడుతూ అమెరికా నుంచి వందలాదిమంది భారతీయులని బంధించి వారిని యుద్ధ విమానాల్లో తీసుకురావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అమెరికాలో వలసదారులుగా ఉన్న భారతీయులను కాళ్లు, చేతులకు సంకెళ్లు వేసి యుద్ధ ఖైదీల్లాగా పంపించడం తగదన్నారు. యుద్ధంలో పట్టుబడిన ఖైదీలను గౌరవంగా చూడాలన్న నిబంధనలు ఉన్నాయని తెలిపారు. ప్రధాని మోడీ అనుసరించిన ఆర్థిక విధానాలు, నిరుద్యోగాన్ని పెంచి పోషించడం వల్లే గత్యంతరం లేక భారతదేశ యువత వలస వెళ్తున్నారన్నారు. మేకింగ్ ఇండియా పేరుతో దేశంలో ఏడాదికి కోటి ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మోడీ మాటలు గడిచిన పదేళ్లలో ఆ మాట ఎక్కడ అమలు కాలేదన్నారు. ప్రపంచ దేశాలలో భారతదేశం నిరుద్యోగంలో రోజురోజుకీ పైస్థాయికి వెళుతుందే తప్ప నిరుద్యోగం రూపుమాపే పరిస్థితి ఎన్‌డిఎ హయాంలో ఎక్కడా జరగలేదన్నారు. అంబానీ, అదానీలకు ఊడిగం చేసే, కార్పొరేట్ శక్తులను మరింత ధనవంతులు చేసే విధానాలు తీసు కొస్తూ దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలన్నింటిని ప్రయివేటుపరం చేస్తున్నార న్నారు. అదానీ, అంబానీ, విజయ్ మాల్యా లాంటివారికి తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. భారతీయుల పట్ల అమెరికా దుశ్చర్యను పూర్తిగా ఖండించి, వెంటనే ట్రంపు చేసే నిరంకుశ విధానాలకు స్వస్తి పలికే విధంగా ప్రధానమంత్రి, విదేశాంగ శాఖ మంత్రి అమెరికా అధ్యక్షుడు ట్రంపుతో, చర్చలు జరిపి వారి విధానాలకు స్వస్తి పలకాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆఫ్రీద్, జిల్లా కమిటీ సభ్యులు జయబాబు, సమీర్, నాయకులు నాని, విష్ణు గణేష్, నరసింహులు, సోని, బలసాయి, రితీష్, సందీప్, కేశవ, చరణ్, సాయి, నంద, రవి, ప్రవీణ్ పాల్గొన్నారు.

మదనపల్లె టిడిపిలో విభేదాలు

◆ ఎమ్మెల్యే, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు మధ్య తారా స్థాయికి గ్రూపు తగాదాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె తెలుగుదేశం పార్టీలో గ్రూపు విభేదాలు తారా స్థాయికి చేరుకున్నాయి. మదనపల్లెలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఏ క్షణంలో ఏం జరుగుతుందోనన్న ఆందోళనలో ప్రజలు ఉన్నారు. వివరాల్లోకి వెళితే.. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులుగా శ్రీరామ్ చిన్నబాబు మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి. టిడిపి టికెట్‌ను సంపాదించి సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా షాజహాన్‌బాషా గెలుపొందినప్పటి నుంచి పార్టీలో లుకలుకలు మొదలయ్యాయి. పార్టీ కోసం కష్టపడి ఎమ్మెల్యేని గెలిపించుకున్న తమకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని, ప్రత్యర్థ పార్టీ వాళ్ళని పార్టీలోకి ఆహ్వానిస్తూ వారినే అందల మెక్కిస్తున్నారని ఆరోపిస్తూ చినబాబు ఆరోపణలు ఎక్కుపెట్టారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే అనుచరులు చిన్నబాబు అనుచరుల మధ్య గ్రూపు తగాదాలు ప్రారంభమయ్యాయి. మూడు రోజులుగా తారాస్థాయికి చేరుకున్నాయి. చినబాబు తనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారంటూ ఎమ్మెల్యే లోలోపలే మండిపడేవారు. ఈ క్రమంలో మదనపల్లి మండలం సిటిఎం వద్ద స్పిన్నింగ్ మిల్ ప్రాంగణాన్ని లే అవుట్ చేసే క్రమంలో చినబాబుకు చెందిన కొన్ని టిప్పర్లు మట్టిని తోలుతుండగా అటుగా వెళుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మట్టి తరలిస్తున్న టిప్పర్లను అడ్డుకున్నారు. విఆర్‌ఒను పిలిపించి మట్టి తోలేందుకు అనుమతి ఉందా అని ప్రశ్నించారు. లేదని చెప్పడంతో వెంటనే లారీలు, టిప్పర్లు సీజ్ చేయాలని ఆదేశించారు. సమాచారం అందుకున్న చినబాబు సంఘటన స్థలానికి చేరుకుని తమ లారీలు, టిప్పర్లు సీజ్ చేయించడానికి ఎమ్మెల్యే ఎవరంటూ అనుచిత వ్యాఖ్యలు చేస్తూ విఆర్‌ఒ దగ్గర నుంచి బలవంతంగా లారీ, టిప్పర్ల తాళాలు లాక్కున్నారు. విఆర్‌ఒ స్థానిక రూరల్ తాలూకా పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సోమవారం రాత్రి పట్టణంలోని రామారావు కాలనీలో ఉన్న ఓ ప్రయివేటు టివి కార్యాలయానికి చినబాబు వచ్చారన్న సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే అనుచరులు అతనిపై భౌతిక దాడి చేయాలన్న ఉద్దేశంతో గుంపులుగా రామారావు కాలనీ చేరుకున్నారు. సమాచారాన్ని పసిగట్టిన చినబాబు అనుచరులు అధిక సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గుంపులు, గుంపులుగా ఉన్న రెండు గ్రూపుల వారిని చెదరగొట్టి అక్కడ నుంచి పంపించేసి ఎలాంటి అల్లర్లు జరగకుండా కట్టడి చేశారు. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి చినబాబు ముఖ్య అనుచరుడు, రాజంపేట తెలుగు యువత ఉపాధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డికి నీరుగట్టువారిపల్లెలో ఉన్న సుధా బ్యూటీ పార్లర్, సుధా ఫొటో స్టూడియోను కొందరు దుండగులు ధ్వంసం చేశారు. షాపు ముందున్న రేకుల షెడ్డును పూర్తిగా కూల్చేశారు. సిసి కెమెరాలు ధ్వంసం చేశారు. మంగళవారం చినబాబు సంఘటనా స్థలానికి చేరుకుని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. టిడిపి పార్టీ కోసం ఎంతో కష్టపడిన పనిచేసిన సుదర్శన్‌రెడ్డి షాపుపై ఎమ్మెల్యే అనుచరులే దాడి చేశారని ఆరోపించారు. ఏదైనా ఉంటే నేరుగా తేల్చుకుందాం అంటూ సవాల్ విసిరారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి కొండయ్యనాయుడు సంఘటనా స్థలానికి చేరుకొని నిందితులు ఎంతటి వారైనా ఉపేక్షించబోమని, కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నాన్ బెలబుల్ సెక్షన్ల కింద. కేసులు నమోదు చేస్తామన్నారు. అల్లర్లు సృష్టించేవారిపై పీడీ యాక్టు పెట్టేందుకు కూడా వెనుకాడబోమన్నారు. మదనపల్లెలో 30 యాక్టును అమల్లోకి తెచ్చామని, ఎవరూ గుంపులుగా ఉండకూడదని తెలిపారు. ఎన్టీఆర్ సర్కిల్లోని నారా లోకేష్ కటౌట్‌తో ఉన్న శ్రీరామ్ చినబాబు కటౌట్ కొంతమంది దుండగులు ధ్వంసం చేయడంతో అది కూడా దుమారాన్ని లేపింది. కక్ష్య పూరితంగానే ఎమ్మెల్యే అనుచరులు తనపై ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని శ్రీరామ్ చినబాబు ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఒకే పార్టీకి చెందిన రెండు గ్రూపుల నువ్వా నేనా అంటూ దాడులు, ప్రతిదాడులకు తెగబడేందుకు సిద్ధపడుతుండంతో మదనపల్లిలో ఉద్రిక్త పరిస్థితిలు నెలకొన్నాయి. ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరి అధికార పార్టీ టిడిపిలో ఉన్న అధినాయకులు ఈ సమస్యను ఎలా పరిష్కరిస్తారో వేచి చూడాల్సి ఉంది.

నీరుగట్టువారిపల్లె వద్ద ధ్వంసమైన రేకులషెడ్డును పరిశీలిస్తున్న డిఎస్‌పి

ప్రతిభ చూపిన విద్యార్థులు

'మిట్స్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మదనపల్లె

హైదరాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో నిర్వహించిన స్థిరమైన జీవనం కోసం ఆవిష్కరణ పరిష్కారాలు అనే థీమ్‌పై కేంద్రీ కృతమైన వినూత్న కార్యక్రమం అన్వేషణ 2024-25లో తమ విద్యార్థులు ప్రతిభనపరిచినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ డేటా సైన్స్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ బి.భాస్కర్ సహాయ సహకారంతో విద్యార్థులు చేసిన ప్రాజెక్టులకు ప్రశంసలు అందుకున్నట్లు తెలిపారు. బి.టెక్ రెండవ, మూడవ సంవత్సరం కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ డేటా సైన్స్ చదవుతున్న సి.బాలాజీ, శివారెడ్డి రెస్యూమ్ ర్యాంకర్ ప్రాజెక్ట్‌కు, టి.గోకుల్, చైతన్య అడ్వాన్స్ ఎనర్జీ మేనేజ్మెంట్ సిస్టంలకు ప్రశంసాపత్రాలను అందజేసినట్లు తెలిపారు. ఆవిష్కరణ, సృజనాత్మకత, స్థిరత్వాన్ని ప్రేరేపించడానికి, ప్రోత్సహించడానికి నిర్వహించబడిన ఈ కార్యక్రమంలో తమ విద్యార్థులతో పాటు అంగళ్ళు జిల్లా పరిషత్ స్కూల్ విద్యార్థులు ఇందులో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు బి.భాస్కర్‌కు ప్రశంసా అవార్డును అందజేశారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను, గైడ్‌ను కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, విభాగాధిపతి డాక్టర్ కుసుమ అధ్యాపక బృందం, తదితరులు అభినందనలు తెలియజేసారు.

సైన్స్ ఫెయిర్‌ను జయప్రదం చేయండి

- అన్నమాచార్య కళాశాల వైస్ చైర్మన్ ఎల్లారెడ్డి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఈ నెల 28వ తేదీన అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో నిర్వహిస్తున్న సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కళాశాల వైస్ చైర్మన్ చొప్ప ఎల్లారెడ్డి కోరారు. మంగళవారం కళాశాలలో సైన్స్ ఫెయిర్‌కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చొప్పా ఎల్లారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.స్వర్ణలత మాట్లాడుతూ జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఈ నెల 28వ తేదీన సైన్స్ ఇన్ యాక్షన్ సెలబ్రేటింగ్ ఇన్నోవేషన్ అండ్ డిస్కవరీ అను ఉద్దేశంతో కళాశాల ఐక్యూ ఎపి విభాగం వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో హైస్కూల్ విద్యార్థులతోపాటు ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్, డిగ్రీ, పీజీ విద్యార్థులు పాల్గొనవచ్చునని తెలిపారు. విజేతలుగా నిలిచిన వారికి ప్రథమ బహుమతిగా రూ.3 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.1500 నగదుతో పాటు ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు వివరించారు. పోటీలో పాల్గొనేందుకు ఈ నెల 20వ తేదీ లోపు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమానికి సంబంధించి సందేహాలు ఉన్నచో కార్యక్రమ నిర్వహణ కమిటీ సభ్యులైన డాక్టర్ ఎం.ప్రమోద్ కుమార్ 94933 84398, డాక్టర్ పి.అనిత 99083 44380 నంబర్లలో సంప్రదించాలని తెలియజేశారు. కార్యక్రమంలో యు.నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న యల్లారెడ్డి, ప్రిన్సిపల్ స్వర్ణలత

3, 4 తరగతుల్లో నూతన నియామకాలు చేపట్టాలి

- ఎల్ఐసి యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.విశ్వనాథ్

పర్సనల్ మేనేజర్ సత్య శ్రీనివాస్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఎల్ఐసిలో కేవలం ఈ ఆర్థిక సంవత్సరం 9 నెలలలోనే 3,130 మంది క్లాస్ 3, 4 తరగతుల్లో సిబ్బంది తగ్గిందని, నియామకాలు చేపట్టాలని ఎల్ఐసి యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.విశ్వనాథ్ పేర్కొన్నారు. మంగళవారం ఎల్ఐసి కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలసీదారులకు మెరుగైన సేవలందించేందుకు నూతన నియామకాలు తక్షణ అవసరమని తెలిపారు. ఎల్ఐసి ఉద్యోగుల సంఘం రాయచోటి డివిజన్ అధ్యక్షులు ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ సంస్థలో నూతన నియామకాలు చాలాకాలంగా జరగడంలేదని, తక్షణం ఈ కేడర్లలో రిక్రూట్మెంట్ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎల్ఐసిలో 86 శాతం మంది సిబ్బందికి ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఎఐఐఇఎ) ప్రాతినిధ్యం వహిస్తోందని, బ్యాంకులలో, సాధారణ బీమా రంగంలో, ఇతర రంగాలలో ఇచ్చినట్టుగా తమ సంఘానికి కూడా గుర్తింపు పునరుద్ధరించాలని అన్నారు. లేనిపక్షంలో ఫిబ్రవరి 20న గంటపాటు దేశవ్యాప్తంగా ఎల్ఐసి సిబ్బంది సమ్మె నిర్వహిస్తారని అన్నారు. అనంతరం యూనియన్ ప్రతినిధి బృందం పర్సనల్ మేనేజర్ సత్య శ్రీనివాస్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. నూతన నియామకాలు, యూనియన్ గుర్తింపు అంశాలపై తమ ఆకాంక్షలను ఎల్ఐసి సిఇఒకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అక్బర్ బాషా, సుధీకర్, వసుప్రద, అయ్యవారు రెడ్డి, వారిజాతమ్మ, పర్వీన్, రత్న కిషోర్, పద్మజ, లీలాలక్ష్మి, శ్రీనివాస కుమార్, రఘు, చిన్నయ్య, సాదక్, గౌస్, శ్రీనివాసులు, శేషయ్య పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి : డిటిసి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకే ప్రభుత్వం ప్రతి ఏటా రహదారి భద్రత వారోత్సవాలను నిర్వహిస్తోందని జిల్లా రవాణా శాఖ అధికారి ప్రసాద్ తెలిపారు. మంగళవారం అన్నమాచార్య యూనివర్సిటీలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భద్రతా నియమాలను పాటిస్తే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయన్నారు. తల్లితండ్రులు జన్మనిస్తే, హెల్మెట్ పునర్జన్మ ఇస్తుందన్నారు. హెల్మెట్ ధరించి వాహనం నడుపుతున్న వారిని అభినందించాలన్నారు. వాహనదారులు బయటకు వెళ్లేటప్పుడు కుటుంబ సభ్యులు తమ కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తుంటారన్న విషయాన్ని గుర్తుంచు కోవాలన్నారు. ప్రమాదాల్లో పెద్ద దిక్కును కోల్పోతే కుటుంబం మొత్తం రోడ్డున పడుతుందన్నారు. వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని, అతివేగం అనర్థదాయకమని, మద్యం తాగి వాహనం నడపవద్దని చెప్పారు. ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని హెచ్చరించారు. ఈ విషయాలను ప్రతి వాహన దారులు గమనించాలని సూచించారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయన్నారు. ప్రధానంగా రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని సకాలంలో సమీపంలో ఉన్నటువంటి ఆసుపత్రికి తీసుకువెళ్లి ప్రభుత్వం అందించే పారితోషకాన్ని పొందాలని కోరారు. కార్యక్రమంలో రాజంపేట మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా రవాణా శాఖ అధికారి ప్రసాద్

పోలీసుల దాష్టీకం

భార్యాభర్తల గొడవలో చితకబాదిన వైనం
న్యాయం చేయాలని బాధితుడి వేడుకోలు

మాట్లాడుతున్న శివప్రసాద్, పోలీసుల లాఠీ దెబ్బలకు కందిపోయిన చేయి

ప్రజాశక్తి- పుల్లంపేట

భార్యాభర్తల గొడవలో భర్త శివప్రసాద్‌ను పోలీసులు విచక్షణా రహితంగా చితకబాదారు. ఒళ్లంతా లాఠీ దెబ్బతలతో కందిపోయింది. మండల కేంద్రానికి చెందిన బాధితులు బొమ్మిశెట్టి శివప్రసాద్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తనకు, తన భార్యకు స్వల్ప ఘర్షణ జరిగిందనీ, ఆ సమయంలో తన భార్య తనను కొరికిందని అందుకు ప్రతిగా తాను చెంప దెబ్బ కొట్టాను. అందుకు తన భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. సోమవారం అర్ధరాత్రి సమయంలో పోలీసులు తనను కొట్టుకుంటూ పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లారు. ఇస్తారాజ్యంగా తనను పోలీసులు కొట్టారు. లాఠీ విరగడంతో డ్రిప్పు పైపుతో సైతం విపరీతంగా కొట్టారని ఒళ్లంతా కందిపోయి రక్త గాయాలతో మీడియా ముందు కన్నీటి పర్యంతమయ్యాడు. తనకు ఆపరేషన్ జరిగిందని ముఖంలో ప్లేట్లు, కాళ్లలో రాడ్లు వేసారని కాళ్లు పట్టి బతిమిలాడుకున్నా వదలకుండా ముఖంపై బూటు కాలుతో పోలీసులు తన్నారని బాధితుడు ఆవేదన వ్యకం చేసాడు. 15 రోజుల క్రితం కూడా తనపై తనను పోలీసులు కొట్టారని తనపై విచక్షణారహితంగా దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలంటూ శివప్రసాద్ డిమాండ్ చేశాడు. కాగా బాధితుని భార్య మాధురి కథనం మేరకు వివరాల్లోకెళ్తే తన భర్త ప్రతిరోజు తాగి వచ్చి తనను కొట్టి చిత్రహింసలు పెడుతున్నాడని తాను విధిలేని పరిస్థితుల్లోనే తన భర్త పెట్టే చిత్రహింసలు తట్టుకోలేక పోలీసులను ఆశ్రయించానని తనకు న్యాయం చేయాలని వేడుకున్నది. కాగా గాయపడ్డ శివప్రసాద్‌ని పుల్లంపేట ఎస్ఐ మోహన్ కుమార్ గౌడ్ రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయించి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న జెఇఒ వీరబ్రహ్మం

మార్చి 5 నుంచి 9 వరకు

కోదండరామాలయంలో మహాసంప్రోక్షణ

- టిటిడి జెఇఒ వి.వీరబ్రహ్మం వెల్లడి

ప్రజాశక్తి- ఒంటిమిట్ట

శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో మార్చి 5 నుంచి 9 వరకు మహా సంప్రోక్షణ కార్యక్రమాలు శాస్త్రక్తంగా నిర్వహించనున్నట్లు టిటిడి జెఇఒశ్రీ వి.వీరబ్రహ్మం చెప్పారు. శ్రీ కోదండరామ స్వామివారి ఆలయంలో జరుగుతున్న జీర్ణోదరణ మరమ్మతు పనులు, బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై మంగళవారం అధికారులతో ఒంటిమిట్టలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జెఇఒ మాట్లాడుతూ గర్భాలయంలో జీర్ణోద్ధరణ కోసం గత ఏడాది సెప్టెంబరు 6 నుంచి వరకు 'బాలాలయం' నిర్వహించినట్లు తెలిపారు. భారత పురాతత్వ శాఖ ఆధ్వర్యంలో ఆలయంలో పునరుద్ధరణ పనులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సకాలంలో ఆలయ పునరుద్ధరణ పనులను పూర్తి చేయాలని టిటిడి అధికారులను కోరారు. మార్చిలో ఆలయంలో మహా సంప్రోక్షణ నిర్వహించి, భక్తులకు మూలమూర్తి దర్శనం కల్పించనున్నట్లు తెలియజేశారు. కడప జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని స్వామివారి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఇందుకోసం త్వరలో జిల్లా అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించనున్నట్లు వివరించారు. ఒంటిమిట్ట ఆలయ పునరుద్ధరణ పనులు, ఏప్రిల్ నెలలో జరగనున్న బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై అన్ని విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను దృష్టిలో ఉంచుకుని వేసవి నేపథ్యంలో భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం జెఇఒ ఆలయంలో జరుగుతున్న మరమ్మతు పనులు, కల్యాణ వేదిక వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సిఇ సత్యనారాయణ, ఎస్ఇ(ఎలక్ట్రికల్) వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఇఒ పి.వి.నటేష్ బాబు, విజిఒసదాలక్ష్మి, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించండి : డిఎల్‌డిఒ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని డివిజనల్ అభివృద్ధి శాఖాధికారి అమర్‌నాథ్ తెలిపారు. మంగళవారం మండలంలోని పోతబోలు పంచాయతీలోని సచివాలయాన్ని, అంగన్వాడీ కేంద్రాన్ని డిఎల్‌డిఒ ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయంలో పలు రికార్డులు పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పరచాలని, తాగునీటి సమస్య రాకుండా చూసుకోవాలని తెలిపారు. ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలపై స్పందిస్తూ కాలయాపన చేయకుండా పరిష్కరించాలన్నారు. విధుల్లో అలసత్వం, నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ తాజ్ మస్రూర్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడీ పిల్లలతో మాట్లాడుతున్న డిఎల్‌డిఒ అమర్‌నాథ్

విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపల్

'డిగ్రీ' ఫలితాల్లో 'శ్రీసాయి' విద్యార్థులకు ర్యాంకులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

యోగివేమన విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల 1,3,5 వ సెమిస్టర్ డిగ్రీ పరీక్ష ఫలితాలను విడుదల చేయగా శ్రీసాయి డిగ్రీ కళాశాల విద్యార్థులు యూనివర్సిటీ మొదటి ర్యాంకులు సాధించారని కళాశాల ప్రిన్సిపల్ ముత్యాల పెంచలయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఎస్‌సి కంప్యూటర్స్‌లో పోలి పల్లవి, పోతురాజు ప్రత్యూష, పోతురాజు పూజిత, షేక్ ఆయేషా, షేక్ మునిర, పదికి పది జిపిఎ సాధించారని అన్నారు. బికాం.కంప్యూటర్స్‌లో గాదంశెట్టి మౌనిష, పలిగల జస్వంత్ 10 జిపిఎ సాధించి యూనివర్సిటీ మొదటి ర్యాంకులను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. బిఎస్‌సి బోటనీలో షేక్ రబియా 9.75, షేక్ నజీమ్ 9.70, జాస్మిన్ 9.5, జ.లక్ష్మీ ప్రసన్న 9.5 జిపిఎ పాయింట్లు సాధించారని చెప్పారు. 9 జిపిఎ కంటే పైగా 99 మంది ఉన్నారని తెలిపారు. మా కళాశాల విద్యార్థులు 92శాతం ఉత్తమ ఫలితాలు సాధించామని కళాశాల ప్రిన్సిపాల్ పెంచలయ్య, డైరెక్టర్స్, పి శ్రీనివాసులు, ఎస్ ఎన్ శ్రీనివాసులు, కె.చంగల్‌రాజు, యు.అనిత, అధ్యాపక బృందం విద్యార్థులను అభినందించారు.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా : సిఐ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మాట్లాడుతున్న సిఐ సత్యనారాయణ

మండలంలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు, చోరీలపై ప్రత్యేక నిఘాను ఉంచినట్లు మదనపల్లి రూరల్ సర్కిల్ సిఐ ఎ.సత్యనారాయణ తెలిపారు. మంగళవారం నిమ్మనపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్‌ఐ తిప్పేస్వామి తో కలిసి పలు కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించి, వాటి పురోగతిని తెలుసుకున్నారు. పోలీసుస్టేషన్‌కు ప్రజలు అనేక సమస్యలతో వస్తుంటారని, అటువంటి వారిని ముందుగా స్నేహపూర్వకంగా పలకరించి, వారి సమస్యలను తెలుసుకొని, తగిన విధంగా విచారించి, చట్టబద్ధంగా బాధితులకు న్యాయం చేయాలని సిబ్బందికి సూచించారు. ఇటీవల మండలంలో పలుచోట్ల కేబుల్ వైర్లు చోరీ జరగడం జరిగిందని, ఇటువంటి దొంగతనాలపై ప్రత్యేకంగా ఓ పోలీస్ క్రైమ్ బృందాన్ని ఏర్పాటు చేసి నిఘా ఉంచనున్నట్లు తెలిపారు. గతంలో ఇటువంటి చోరీలకు పాల్పడిన వారిని గుర్తించి, వారిపై నిఘా ఉంచుతామన్నారు. ఇటువంటి చోరీల సంఘటనలలో సాంకేతికతను ఉపయోగించి నిందితులను పట్టుకుంటామన్నారు. రాత్రి వేళల్లో పోలీసుల గస్తీలను మరింత పటిష్టంగా చేపడుతామన్నారు. మండలంలో నాటు సారా తయారీ, గంజాయి రవాణా, బెల్టు షాపుల నిర్వహణ వంటి అసాంఘిక శక్తులపై పోలీసులు ప్రత్యేక నిఘాను ఉంచినట్లు పేర్కొన్నారు. ప్రజలు కూడా అసాంఘిక శక్తులపై పోలీసులకు సమాచారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ తిప్పేస్వామి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-సుండుపల్లె

ఎస్‌ఐకు ఫిర్యాదు చేస్తున్న రెడ్డిరాణి

తనపై దుష్ప్రచారం చేస్తున్న వైసిపి మండల కన్వీనర్ రామస్వామిరెడ్డిపై చర్యలు తీసు కోవాలని కోరుతూ మండలానికి చెందిన జనసేనపార్టీ మహిళా నాయకులు నంద్యాల రెడ్డిరాణి పోలీసులను ఆశ్రయించారు. మంగళ వారం ఎస్‌ఐ శ్రీనివాసులును కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తన వ్యక్తిగత ప్రతిష్ట దెబ్బతినేలా రామ స్వామి సామిరెడ్డి సోషల్ మీడియాలో తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉంటూ ప్రజా సమస్యల పరి ష్కారానికి కృషి చేస్తు న్నానని అన్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డిని విమ ర్శించా ననే కార ణంతో తనపై లేనిపోని నిందలు వేస్తూ, తన ప్రతిష్టకు భంగం కలిగేలా సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనపై దుష్ప్రచారం చేస్తున్న రామ స్వామిరెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరినట్లు తెలిపారు.

నేడు ప్రత్యేక విద్యుత్ అదాలత్

ప్రజాశక్తి-కలికిరి

మండల కేంద్రం కలికిరిలో బుధవారం జరిగే విద్యుత్ అదాలత్‌ను వినియోగదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎఇ వై.చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. పీలేరు డివిజన్ పరిధిలోని ఆరు మండలాల్లో ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కె.వి.పల్లి, పీలేరు, కలికిరి, వాయల్పాడు, గుర్రంకొండ, కలకడ మండల విద్యుత్ సమస్యలపై ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు కలికిరి సబ్ డివిజన్ (మదనపల్లి రోడ్డు) వద్ద విద్యుత్ అదాలత్ ఉంటుందని తెలిపారు.

చాందినీ బండ్లకు అనుమతి తప్పనిసరి : సిఐ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సిటిఎం నల్లవీరగంగాభవాని జాతరకు చాందినీ బండ్లు కట్టేవారు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని మదనపల్లె తాలూకా సిఐ కళా వెంకటరమణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 12 నుంచి 20వ తేదీ వరకు సిటిఎం గ్రామంలోని నల్లవీర గంగాభవాని జాతర జరుగుతుందన్నారు. ముఖ్యంగా 14, 15వ తేదీలలో రాత్రి, పగలు తిరణాల సందర్భంగా జనం తాకిడి ఎక్కువగా ఉంటుందన్నారు. 14వ తేదీ గ్రామస్తులు అమ్మవారికి చాందిని బండ్లు కడుతారని అయితే వీటికి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాన్నారు. ఎవరైతే చాందిని బండ్లు ఏర్పాటు చేస్తున్నారో వారి ఆధార్ కార్డు, వారి అడ్రస్ తో పోలీసు స్టేషన్లో దరఖాస్తు చేసుకుని అనుమతి తీసుకోవాలని చెప్పారు. 12 అడుగులు ఎత్తుకు మించి చాందినీ బండ్లు కట్టకూడదని, మైకుకు ప్రత్యేక అనుమతి పొందాలన్నారు. రికార్డింగ్ డ్యాన్సులు నిషేధమన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన, మద్యం తాగి వాహనాలు నడిపిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో జాతర జరుపుకోవాలని తెలియజేశారు. గ్రామస్తులు, ప్రజలు, భక్తులు పోలీసులకు సహకరించాలని కోరారు. జాతర సందర్భంగా 14,15వ తేదీలలో ట్రాఫిక్‌ను మళ్ళించామని కాశీరావు ఎట నుంచి కొత్త బైపాస్ రోడ్‌లో వెళ్లేలా వాహనాలను మళ్లించామని, వాహనదారులు గమనించాలని కోరారు

హుండీ ఆదాయం రూ.4.96 లక్షలు

ప్రజాశక్తి-నందలూరు



హుండీలోని నగదును లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

జిల్లాలో ప్రసిద్ధి గాంచిన, చారిత్రాత్మక నందలూరు శ్రీ సౌమ్య నాథస్వామి హుండీని మంగళవారం లెక్కించగా రూ.4,96,388లు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇన్స్‌పెక్టర్ దిలీప్‌కుమార్ తెలి పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక నెల తరవాత హుండీని లెక్కించడం జరిగిందని అన్నారు. వచ్చిన మొత్తాన్ని బ్యాంకులోని ఆలయ ఖాతాలో జమ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ గురు స్వామి యాదవ్, విజిలెన్స్ అధికారి భాస్కర్ నాయుడు పాల్గొన్నారు.

ప్రతి రైతూ యూనిక్ ఐడి పొందాలి : డిఎఒ

రామాపురం : రైతులతో మాట్లాడుతున్న డిఎఒ చంద్రానాయక్

ప్రజాశక్తి-రామాపురం

రైతులు భూముల యూనిక్ ఐడి కోసం భూమి పట్టాదారు పాసుబుక్ లేదా 1బి రైతు ఆధార్ కార్డు సంబంధిత లింకు ఉన్న ఫోన్ నెంబర్ రైతు సేవ కేంద్రంలో నమోదుచేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ తెలిపారు. మండలంలోని నల్లగుట్ట పల్లి రైతుసేవ కేంద్రాన్ని మంగళ వారం ఆయన సందర్శించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలేషన్ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రైతులకు 11 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు (యూనిక్ ఐడి) ఆధార్ కార్డ్ తరహాలో ఇస్తుందన్నారు. సొంత భూములు గల రైతులకు కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న వివిధ పథకాలు రాయితీలు పిఎం కిసాన్ ఎరువుల రాయితీలు పెట్టుబడి, రాయితీలు పంటల రుణాలు, వ్యవసాయ అనుబంధ రంగాల శాఖల సేవలు పొందాలంటే రైతు ఈ 11 అంకెల విశిష్ట సంఖ్య నమోదు (ఫార్మర్ రిజిస్ట్రీ) తప్పనిసరి నమోదు చేసుకోవాలని రైతులకు తెలిపారు. ఈ నమోదు కార్యక్రమం గ్రామాల్లోని రైతు సేవ కేంద్రాలలో నమోదు చేస్తారన్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వై.నాగమణి, ఎఇఒ కవిత, రైతు సేవా కేంద్రం సిబ్బంది లక్ష్మీదేవి, రైతులు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** వ్యవసాయ శాఖ ద్వారా పట్టదారులైన రైతుల వివరాలు అగ్రి స్టాక్ ఎపిఐఎఫ్ఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న రైతులకు ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్య జారీ చేయబడుతుందని ఎంఎఒ చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపిఎఫ్ఆర్ సంఖ్య ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే వివిధ సంక్షేమ పథకాలు, పిఎం కిసాన్, ప్రభుత్వ రాయితీలు, ఎరువులు, విత్తనాలు, సూక్ష్మ సేద్యం,రైతు రుణాల మంజూరు మొదలైన పథకాలకు వాటికి అనుసంధానం చేయబడుతుందని అన్నారు. రైతులందరూ తమకు సంబంధించిన 1బి, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా, రేషన్ కార్డు, ఆధార్ అనుసంధానం కలిగిన మొబైల్ ఫోనుతో సహా తమ రైతు సేవా కేంద్రం సిబ్బందిని వెంటనే సంప్రదించాలని సూచించారు. ఈనెల 28వ తేదీలోపు రిజిస్ట్రేషన్ పూర్తిచేసుకోవాలన్నారు. ఈ రిజిస్ట్రేషన్ కొరకు రైతు స్వయంగా వచ్చి ఆధార్ ఇకెవైసి ద్వారా నమోదు చేసుకోవలసి ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని అప్పయ్య రాజుపేట గ్రామంలో మంగళవారం మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీకర్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలం ఉన్న ప్రతి రైతు కూడా మీకు దగ్గరలో ఉన్న రైతు భరోసా కేంద్రంలో రైతు పోర్టల్‌లో పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. నంతరం ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌ఛార్జి మస్తాన్ మాట్లా డుతూ ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు ప్రతి ఒక్కరూ కూడా రైతు పోర్టల్ పేరు నమోదు చేసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయంలో పండిన కూరగాయలు, ఆకుకూరలను ప్రతి సోమవారం మండల వ్యవసాయ కార్యాలయంలో స్టాల్స్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రతి రైతు కూడా ప్రకృతి వ్యవసాయం చేయాలని వారికి కావాల్సిన సలహాలు సూచనలు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది గాయత్రి, రైతులు పాల్గొన్నారు.

పుల్లంపేట : రైతులకు సూచనలు ఇస్తున్న ఎంఎఒ శ్రీకర్

ప్రతి ఇంటినీ సర్వే చేయాలి : ఎంపిడిఒ

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ జవహార్ బాబు

ప్రజాశక్తి-గాలివీడు

సచివాలయ సెక్రటరీలు, పంచాయతీ కార్యదర్శులు కలిసి గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి సర్వే పూర్తి చేయాలని ఎంపిడిఒ సి.ఎ. జవహర్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం ఎంపిడిఒ సభా భవనంలో పంచాయతీ కార్యదర్శులు సచివాల సెక్రటరీ తో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 0 నంచి నుంచి 6 సంవత్సరాల లోపల ఉన్న వారికి ఆధార్ కార్డును తప్పనిసరిగా చేయించాలని , గ్రామ సచివాలయాలు అందుబాటులో ఉన్న ఆధార్ సెంటర్‌ను ఉపయోగించు కోవా లని పేర్కొన్నారు. తొమ్మిది రకాలకు సంబంధించిన సర్వేని సకాలంలో పూర్తి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఆంజనేయులు నాయక్, సరోజ, సుకుమార్, కాలేబు ,శివ నాయక్, మదన్మోహన్, నరేష్, రసూల్ పాల్గొన్నారు.

కోళ్ల ఫారం తొలగించాలి

గాలివీడు: మండలంలోని గోరాన్ చెరువు పంచాయతీ దాసరవాండపల్లిలో ఉన్న కోళ్ల ఫారంను తొలగించాలని బిసి కాలనీకి చెందిన ప్రజలు మంగళవారం ఎంపిడిఒ జోహార్ బాబును కలిసి వినతి పత్రం సమర్పించారు. దాసరివారిపల్లిలో ఆరు నెలలుగా పాఠశాల , అంగన్వాడీ కేంద్రం వద్ద కోళ్ల ఫారం ఏర్పాటు చేసి పిల్లల అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. పిల్లలు ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని అక్కడ ఏర్పాటు చేసిన కోళ్ల ఫారాలను తొలగించాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమం చేపడతామని పేర్కొ న్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో కేశవ, కవిత, వీర భాస్కర, శ్రీరాములు, భూదేవి, ప్రసాద్. లోకేశ్వర. శీను, శ్రీనివాసులు ఉన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి-నందలూరు

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ప్యానల్ న్యాయవాది వినయ్ కుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ అమరావతి వారి సూచనల మేరకు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ బాబా ఫక్రుద్దీన్, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ భార్గవి ఆదేశాల మేరకు మంగళవారం నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీలో సర్వే నిర్వహించడం జరిగింది. మండలంలో పుట్టిటి పిల్లలు, బుద్ధిమాంద్యం గల పిల్లలకి వారికి కావాల్సిన చికిత్స మేరకు సూచనలు ఇస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. బాల్య వివాహాలపై తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. పిల్లలను బాగా చదివించి వారి అభ్యున్నతికి తోడ్పడాలన్నాఆరు. కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్ గోపినాథ్‌యాదవ్ పాల్గొన్నారు.

విద్యార్థులను పరిశీలిస్తున్న వినయ్‌కుమార్

అడవికి నిప్పుపై అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

అడవికి నిప్పు పెట్టొద్దు

- అటవీ శాఖ అధికారులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

అడవికి నిప్పు అంటించడం మానవాళి మనుగడకు ముప్పేనని అటవీ శాఖ వాల్మీకిపురం సెక్షన్ అధికారి సుధాకర అన్నారు. మంగళవారం రాత్రి నిమ్మనపల్లి మండలంలోని ముష్టూరు పంచాయతీ యరప్పగారిపల్లిలో ఫారెస్ట్ బీట్ అధికారి శోభారాణి, ఎబిఒ హరినాథ్‌రెడ్డితో కలిసి ప్రజలకు, గొర్రెలు, మేకల కాపరులకు అడవిలో నిప్పు అంటించడం నేరమని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడవిలో అనేక రకాల వన్యప్రాణులు నివసిస్తుంటాయని అటువంటి అడవికి నిప్పు అంటించడం మానవాళి మనుగడకు ప్రమాదకరమని అన్నారు. అడవికి నిప్పు అంటించడంతో దట్టమైన అటవీ ప్రాంతం అగ్నికి ఆహుతి అవడమే కాకుండా, విలువైన వృక్ష సంపదను కోల్పోతామన్నారు. తద్వారా వాతావరణంలోను మార్పులు సంభవించి సకాలంలో వర్షాలు రావడం ఆలస్యం అవుతుందని తెలియజేశారు. వన్యప్రాణులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలందరికీ ఉందని, అడవికి నిప్పు అంటించరాదన్నారు. ఎన్నో జీవరాశులకు ప్రాణాధారమైన అడవిని అగ్నికి ఆహుతి చేయడం చట్టారీత్యా నేరమన్నారు. అటువంటి వారిపై అటవీ శాఖ, వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. పర్యావరణం కూడా కాలుష్యమై మానవాళికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని అన్నారు. అటవి సంపదన రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. వన్యప్రాణుల సంరక్షణను బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు ఎఫ్‌బిఒ శోభారాణి, ఎబిఒ హరినాద్‌రెడ్డి, కొండగాళ్ల రమణ, ప్రజలు పాల్గొన్నారు.

అరుణాచలానికి ఆర్‌టిసి ప్రత్యేక సర్వీసులు

ప్రజాశక్తి-పీలేరు

ప్రయాణికులు, యాత్రికులకు సౌకర్యంగా ఆర్‌టిసి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నామని పీలేరు డిఎంపి. నిర్మల తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ నుంచి అరుణాచలంకు ప్రత్యేక బస్సు సర్వీసులను ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎం మాట్లాడుతూ పుణ్య క్షేత్రాలకు తీర్థయాత్రల కోసం వెళ్లే భక్తులకు సౌకర్యార్థంగా బస్సు సర్వీసులు నడుపుతున్నామన్నారు. ఆర్‌టిసి బస్సులో ప్రయాణం సౌకర్యం, సురక్షితమైందని, ప్రయాణికులు, యాత్రికులు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిఐ సుబ్బమ్మ, ఉద్యోగులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-నందలూరు

గర్భిణులను పరీక్షిస్తున్న డాక్టర్ శరత్‌కమల్

ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 51 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ శరత్‌కమల్, డాక్టర్ కార్తిక్ విశ్వనాథ్ తెలిపారు. గైనకాలజిస్ట్ డాక్టర్ మస్తానమ్మ 42 మంది గర్భిణులకు స్కానింగ్ చేసి తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ గర్భిణీలుగా ఉన్న సమయంలో గుర్రపు వాతము, మధుమేహం, థైరాయిడ్, గుండె జబ్బులు ఉన్న వారిని పరీక్షించి వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేసి గర్భవతులకు బిపి ,రక్త పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. అనంతరం రాయల్ సేవ సమితి అధ్యక్షుడు గంగనపల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పౌష్టిక ఆహార వితరణగా అందిం చారు. కార్యక్రమంలో సూపర్వైజర్ సునీల్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం లు, ఆశా కార్యకర్తలు, రాయల్ సేవా సమితి సభ్యులు హరి, భరత్, పెంచలయ్య, రాము పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

మండలంలోని సచివాలయ ఉద్యోగులు మారుమూల గ్రామాలలోని ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని అన్నమయ్య జిల్లా గ్రామ వార్డు సచివాలయ అధికారి లక్ష్మీపతి సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని కుక్కరాజుపల్లి సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరు రిజిస్టర్, సచివాలయ సిబ్బంది పనితీరు, సిటిజన్ బోర్డు, రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బంది ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి పథకాలను ప్రజలకు అందించడానికి స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో కృషి చేయాలని సూచించారు. సచివాలయ పరిధిలోని గ్రామాలలో తాగునీరు సమస్యకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అదేవిధంగా పారిశుధ్యం, వీధిలైట్లు, మౌలిక సదుపాయాలు కల్పనలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. సిబ్బంది సకాలంలో హాజరై గ్రామాలలోని ప్రతి గడపను సందర్శించి సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కరిం చాలని ఆదేశించారు. ఆయన వెంట కార్యదర్శి అనిత, సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

వార్డు సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న లక్ష్మీపతి

విద్యార్థులకు నగదును అందిస్తున్న సర్వేజన సమితి సభ్యులు, ఎంఇఒ

విద్యా సామగ్రి వితరణ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని బోటుమీదపల్లి సభ్యులు దాదాపు 14 సంవత్సరాల నుంచి పుల్లంపేట, ఓబులవారిపల్లి మండలాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు కీ.శే.జనార్దన్ యాదవ్ జ్ఞాపకార్థంగా విద్యా సామగ్రిని అందిస్తున్నట్లు సర్వేజనా సేవా సమితి సభ్యులు తెలిపారు. గత పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ఎంఇఒ చక్రధర్‌రాజు చేతుల మీదుగా నగదు బహు మతి, మెడల్స్ అందించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లా డుతూ సర్వేజనా సేవా సమితి సభ్యులంతా కూడా చాలా మంచి పనులు చేస్తున్నారని అభినందించారు. ఈ సేవా కార్యక్రమాలు విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. బోటు మీద పల్లి పాఠశాలకు 20 వాట్స్ వైర్లెస్ స్పీకర్‌ను కూడా అంది వ్వడం అభినందనీయమని అన్నారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో సర్వేజనా సమితి సభ్యులు చంద్రశేఖర్ నాయుడు గ్రామస్తులు, ఉపాధ్యాయులు ప్రభాకర్ రెడ్డి, శశికళ, రమణమూర్తి పాల్గొన్నారు.

మంచినీటి సమస్య పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-సుండుపల్లి

ఎంపిడిఒకు వినతిపత్రం అందిస్తున్న రెడ్డెయ్య

మండల పరిధిలోని పెద్దినేని కాలవ గ్రామం, తోటిమాల పల్లిలో ఫిబ్రవరి నెల ప్రారంభం నుంచే మంచి నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నాని నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ గ్రామానికి చెందిన పాల రెడ్డెయ్య ఎంపిడిఒకు వినతిపత్రం అందిం చారు. అనం తరం ఆయన మాట్లా డుతూ ఫిబ్రవరి నెల ప్రారంభం నుంచే ఎండ తీవ్రత పెరగడంతో గ్రామంలో మంచినీటి సమస్య ఏర్ప డిందని అన్నారు. తమ గ్రామానికి వాటర్ ట్యాంకర్‌గానీ, కుళాయి సౌకర్యం లేదన్నారు. బోరు కూడా ఒక కిలోమీటరు దూరంలో ఉండటంతో నీటి ఉధృతి తగ్గి సన్నగా వస్తున్నాయని తెలిపారు. గ్రామంలో ఉన్న 65 కుటుంబాలు నీటి సౌకర్యం లేక అనేక రకాల ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. గ్రామంలోనే ఒక బోరును వేయించి, ఇంటింటికి కుళాయిలు అమర్చి శాశ్వత నీటి ట్యాంక్‌ను పొందుపరచి నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

పల్లకిలో ఊరేగిన శ్రీనివాసుడు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

పల్లకీ సేవలో వెంకటరమణ

మండలంలోని కోసవారి పల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయలో టిటిడి ఆధ్వర్యంలో స్వామివారి వార్షిక బ్రహ్మో త్సవాలు ఘనంగా నిర్వహి స్తున్నారు. టిడిపి ఆగమ అడ్వైజర్ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు కృష్ణ ప్రసాద్ బట్టర్,రమేష్ బాబు, కృష్ణమూర్తి, ధనుష్ సాంప్రదా యబద్ధంగా నియమ నిష్ఠలతో మంగళవారం ఉదయం పల్లకిలో ప్రత్యేక అలంకరణలో శ్రీవారి ఊరేగింపు నిర్వహి ంచారు. సాయంత్రం అశ్వ వాహ నంపై నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్స్‌పెక్టర్ దిశంత్ కుమార్, ఆలయ సిబ్బంది నగేష్, నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-పీలేరు

ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షులు వగళ్ళ చంద్రారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న పెన్షనర్ల సంఘం కార్యాలయంలో తిరుపతిలోని అమెరికన్ లేజర్ ఐ ఆస్పత్రి వైద్య బృందం బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంప్లాయిస్ హెల్త్ కార్డ్ దారులకు ఉచిత శుక్లం ఆపరేషన్లు చేయబడుతాయని, ఆరోగ్యశ్రీ కార్డు దారులకు కూడా ఉచిత కంటి ఆపరేషన్లు చేయబడుతాయని పేర్కొన్నారు. ఆపరేషనుకు ఎంపికైన వారిని వైద్య శిబిరం రోజే ఆస్పత్రికి తీసుకు వెళ్లడం జరుగుతుందని అన్నారు. వివరాలకు సెల్ నెంబర్ 9390053731కు సంప్రదించాలని సూచించారు. కంటి పరీక్షల కోసం వచ్చే వారు విధిగా ఆరోగ్యశ్రీ కార్డు, ఆధార్ కార్డు తీసుకు రావలన్నారు.

క్రైం కార్నర్

భార్య హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు

ప్రజాశక్తి-రామాపురం

జీవితఖైదు పడిన ముద్దాయితో కానిస్టేబుల్

భార్యను అతి కిరాతకంగా హత్య చేసిన కేసులో భర్త ధనుంజయకు ఐదవ అదనపు జిల్లా జడ్జి జీవిత ఖైదు, రూ.5వేలు జరిమానా విధించినట్టు ఎస్‌ఐ వెంకట సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు..మండలంలోని నల్లగుట్టపల్లి పంచాయతీ పాతపల్లి చెందిన ధనుంజయకు సంబేపల్లి మండలం కొత్తపల్లి చెందిన ఉడం భద్రయ్య తన పెద్ద కుమార్తె పెద్ద రెడ్డమ్మను వివాహం చేశారు. వివాహ సమయంలో కట్న కానుకలు కింద ఏడు తులాల బంగారు, లక్ష రూపాయలు నగదు ఇచ్చి వివాహం చేశారు. అదనపు కట్నం కోసం తన కుమార్తె మానసికంగా, శారీరకంగా వేధిస్తుండేవాడని, 2017 ఫిబ్రవరి27 తేదీన రాత్రి 9 గంటల సమయంలో తన అల్లుడు ధనుంజయ తన తమ్ముడుతో కలిసి తన కుమార్తె తల పైన కొట్టి హత్య చేసినట్లు ఫిర్యాదు చేశారు. అప్పటి పులివెందుల ఎఎస్‌పి అన్బురాజన్ ముద్దాయిలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు. ఈ కేసులో ముద్దాయి ధనుంజయకు జీవిత ఖైదు విధిస్తూ, రూ.5వేలు జరిమానా విధిస్తూ 5వ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్ కుట్టి తీర్పునిచ్చినట్లు ఆయన తెలిపారు. సరైన సమయంలో ముద్దాయిలను కోర్టు హాజరు పరిచిన కోర్టు కానిస్టేబుళ్లు ఆదినారాయణ, శివప్రసాద్‌లను ఉన్నతాధికారులు అభినందించినట్లు తెలిపారు.

అదనపు కట్నం వేధింపులపై ఫిర్యాదు

ప్రజాశక్తి-రామసముద్రం

మండలంలోని ఊలపాడు పంచాయతి నరసాపురం గ్రామానికి చెందిన శంకరప్ప కుమార్తెను 12 సంవత్సరాలు క్రితం కొలారు జిల్లా వి.పాల్యానికి చెందిన వెంకటరమణతో వివాహం జరిపించారు. వీరికి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. ఇప్పుడు భర్త అదనంగా కట్నం తీసుకురావాలని శారీరకంగా, మానసికంగా వేసిస్తూ ఇంటి నుంచి బయటకు గెంటేశారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు.